సాక్షి మెదక్

మంగళవారం ꠰ 8 ꠰ ఏప్రిల్ ꠰ 2025



గండిపల్లి ప్రాజెక్టు కలేనా?

గౌరవెల్లి రిజర్వాయర్‌కు అనుబంధంగా నిర్మిస్తున్న గండిపల్లి ప్రాజెక్ట్ కలగా మిగిలిపోయింది. వివరాలు 8లో ▸



వన్యప్రాణుల దాహార్తి తీరేలా..

వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. వివరాలు 8లో ▸



మృత్యు పిలుపులు

వెల్దుర్తి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే దారులు ప్రమాదకరంగా మారాయి. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ప్రజావాణికి 95 వినతులు

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణి ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. సంబంధిత అధికారులు ప్రతి అర్జీని సమగ్రంగా పరిశీలించి నిర్దిష్ట సమయంలోగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌ఓ భుజంగరావు, ఏఓ యూనస్, వివిధశాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోండి



మహిళా సంఘాల సభ్యులతో అదనపు డీఆర్డీఓ సరస్వతి

మనోహరాబాద్(తూప్రాన్): మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల ద్వారా తీసుకునే రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని అదనపు డీఆర్డీఓ సరస్వతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మహిళా సంఘం సభ్యురాలు స్వప్న ఏర్పాటు చేసుకున్న కిరాణా దుకాణాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను మహిళా సంఘాల సభ్యులు ఆదాయ వనరులు పెంపొందించుకోవడానికి వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

అదనపు ఎస్పీ మహేందర్



బాధితులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అదనపు ఎస్పీ మహేందర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి తక్షణ పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. శాంతి భద్రతలను పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్‌శాఖ పనిచేస్తుందని అన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట సీపీఎం నాయకుల ధర్నా

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన భూ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మల్లేశం డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పేరుకుపోయిన భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఇంటి స్థలం లేని వారికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు వెంటనే మంజూరు చేయాలని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ నగేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కోరెంకల మల్లేశం, బాలమణి, జిల్లా కమిటీ సభ్యులు గౌరి, సంతోష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి: సీఐటీయూ

మెదక్ కలెక్టరేట్: ఆశావర్కర్లకు రూ. 18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కేవల్‌కిషన్ భవన్‌లో నిర్వహించిన ఆశావర్కర్స్ యూనియన్ 13వ జిల్లా మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆశాలు 20 ఏళ్లుగా అనేక రకాలు సేవలు అందిస్తున్నారని చెప్పారు. అనంతరం సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాల సేవలను గుర్తించకుండా పారితోషకాల పేరుతో శ్రమ దోపిడీ చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే మరోసారి దీర్ఘకాలిక ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



మోడు వారినా అందమే

రామాయంపేట మండలం దంతేపల్లి అటవీలో పచ్చని ఆకులతో కళకళలాడిన చెట్లు వేసవిలో పూర్తిగా ఎండిపోయాయి. ఎత్తయిన ప్రదేశంలో ఉన్న రెండు చెట్లకు ఒక్క ఆకు కూడా లేకుండా రాలిపోయాయి. ప్రస్తుతం ఎండిన కొమ్మలు కనువిందు చేస్తుండగా.. సోమవారం 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

– రామాయంపేట(మెదక్)

తగ్గేదేలే!

బర్డ్‌ఫ్లూతో పడిపోయిన విక్రయాలు

- అయినా తగ్గని చికెన్ ధరలు
- కోళ్ల పెంపకం అంటేనే జంకుతున్న రైతులు





మెదక్ పట్టణం ఆటోనగర్‌లోని ఓ చికెన్ సెంటర్‌లో బర్డ్‌ఫ్లూ వైరస్‌కు (రెండు నెలల) ముందు నిత్యం 10 క్వింటాళ్ల చికెన్ విక్రయాలు జరిగేవి. ప్రస్తుతం రోజుకు క్వింటాల్ చికెన్ మాత్రమే విక్రయిస్తున్నారు. గతంలోనూ కిలో చికెన్ ధర రూ. 180 పలకగా, ప్రస్తుతం దాని ధర రూ. 210కి చేరింది. ఈ లెక్కన జిల్లావ్యాప్తంగా 90 శాతం చికెన్ విక్రయాలు పడిపోయాయి. అయినా ధర ఏ మాత్రం తగ్గలేదు.

– మెదక్‌జోన్

ఎన్ని అవాంతరాలు ఎదురైనా బ్రాయిలర్ కోడి ధర తగ్గేదేలే అంటోంది. మొన్నటి వరకు బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ మార్కెట్ భారీగా పతనమైన విషయం తెలిసిందే. భారీ నష్టాలతో పౌల్ట్రీ రైతులు కోళ్ల పెంపకానికి దూరం అయ్యారు. దీంతో డిమాండ్‌కు తగిన సప్లై లేక ఈ మధ్య చికెన్ ధర అమాంతం పెరిగింది. రెండు నెలల క్రితం చికెన్ అంటేనే జనం జంకే పరిస్థితులు ఉండేవి. ఈ క్రమంలో కిలో చికెన్ ధర రూ.150కు పడిపోయింది. బర్డ్‌ఫ్లూ భయం పోగొట్టేందుకు పౌల్ట్రీ యజమానులు చికెన్ వంటకాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. అయినా మార్కెట్ పుంజుకోలేదు. జిల్లావ్యాప్తంగా 3 వేల పైచిలుకు కోళ్ల ఫారాలు ఉండగా, వీటి ఆధారంగా వేలాది మంది రైతులతో పాటు కూలీలు జీవనం సాగిస్తున్నారు. కాగా ఫిబ్రవరిలో బర్డ్‌ఫ్లూ కలకలం రేపటంతో చాలా వరకు చికెన్ తినడం మానేశారు. ఇక మార్చిలో అంతుచిక్కని వైరస్‌తో వేలాది కోళ్లు మృత్యువాత పడ్డాయి. మార్కెట్లో చికెన్ విక్రయాలు తగ్గటంతో సదరు కంపెనీకి చెందిన నిర్వాహకులు సైతం వాటిని ఫారాల్లోనే వదిలేశారు. దీంతో కోళ్ల ఫారం నిర్వాహకులు వైరస్ సోకిన కోళ్లను గుంతలు తీసి పూడ్చిపెట్టారు. అయితే పలు కంపెనీల నిర్వాహకులు కోడి పిల్లలతో పాటు దాణను సమకూరుస్తారు. కోళ్లను పెంచిన పౌల్ట్రీ రైతుకు వాటి బరువును బట్టి కమీషన్ ఇస్తుంటారు. కాగా 2 నెలలుగా కోళ్లు చనిపోవటంతో పోషకులకు కమీషన్ ఇవ్వడం మానేశారు. దీంతో పౌల్ట్రీ రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు.

కోడి పిల్లలు తీసుకోండి..

బర్డ్‌ఫ్లూతో సుమారు 2 నెలల పాటు కోళ్ల ఫారాలు కూనరిల్లాయి. ఇక వైరస్ పోయింది.. కోడి పిల్లలను తీసుకోవాలని సదరు కంపెనీల నిర్వాహకులు కోళ్లపెంపకం దారులను కోరుతున్నట్లు తెలిసింది. అయితే ఒక బ్యాచ్ కోళ్లు పెరగాలంటే 50 నుంచి 55 రోజుల గడువు పడుతుండటంతో అప్పటిలోగా పూర్తిగా సమసిపోతాయని రైతులకు నచ్చచెబుతున్నారు. అయినప్పటికీ రైతులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ప్రజల్లో పూర్తిస్థాయిలో భయం పోయి చికెన్ తినటం ప్రారంభించినప్పుడే కోళ్లను పెంచటం మంచిదని భావిస్తున్నట్లు తెలిసింది.

తగ్గని చికెన్ ధరలు

బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో కోళ్ల పరిశ్రమలకు కోలుకోలేని ఎదురు దెబ్బ తగిలింది. దీంతో 90 శాతం చికెన్ విక్రయాలు తగ్గాయి. అయితే చికెన్ ధరలు ఏమాత్రం తగ్గటం లేదు. మార్చిలో రంజాన్ నేపథ్యంలో కిలో చికెన్ ధర రూ. 280 పలికింది. హలీం తయారీ కోసం చికెన్ ఎక్కువగా ఉపయోగించటంతో చికెన్ ధర భారీగా పెరిగిందని పలువురు చెబుతున్నారు. అయితే వారం రోజులుగా కాస్త ధర తగ్గి ప్రస్తుతం కిలో ధర రూ. 210 పలుకుతోంది.



పారిశుద్ధ్య కార్మికుడి ఇంట్లో భోజనం చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

సన్న బియ్యం పేదలకు వరం

కలెక్టర్ రాహుల్‌రాజ్

కొల్చారం(నర్సాపూర్): సన్న బియ్యం పథకం నిరుపేద కుటుంబాలకు ఎంతో మేలు చేస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాంపూర్‌లో పారిశుద్ధ్య కార్మికుడు దుర్గారాజు ఇంటిలో కలెక్టర్ భోజనం చేశారు. కుటుంబ సభ్యుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 520 రేషన్ షాపులకు గాను 7 లక్షల మంది లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నాణ్యత గల సన్న బియ్యం పంపిణీ చేస్తుండంతో ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. గతంలో దొడ్డు బియ్యం రేషన్ షాపుల ద్వారా తీసుకొని బయట విక్రయించే వారన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఎంపీడీఓ రఫీ ఉన్నిసా, తహసీల్దార్ గఫార్‌మియా, ఎంపీఓ కృష్ణవేణి, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

త్వరలోనే ఇంటర్ ఫలితాలు

మెదక్‌జోన్: త్వరలోనే ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాలు వెల్లడి కానున్నాయని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని బాలుర జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఇంటర్ మూల్యాంకన సెంటర్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ ముగిసిందని.. ప్రస్తుతం రీకౌంటింగ్, రీవాల్యువేషన్ ప్రక్రియ నడుస్తుందన్నారు. కాగా 690 మంది అధ్యాపకులు మూల్యాంకన ప్రక్రియలో పాల్గొని దాదాపు 1.87 లక్షల జవాబు పత్రాలు మూల్యాంకనం చేశారని తెలిపారు. అంతకు ముందు కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడారు. రాజీవ్‌యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

నిజాంపేట(మెదక్): రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని కె. వెంకటాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం రైతులను ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో నిరుపేదలకు సన్న బియ్యంతో పాటు ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. తేమశాతం 17 ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. రామాయంపేటలో రూ. 200 కోట్లతో సమీకృత గురుకులం పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు, మండల డిప్యూటీ తహసీల్దార్ రమ్యశ్రీ, మండల వ్యవసాయ అధికారి సోమ లింగారెడ్డి, ఎంపీడీఓ రాజిరెడ్డి, నాయకులు మహేందర్, లింగంగౌడ్, అమరసేనారెడ్డి, అజయ్, సామల మహేష్ వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం



పాదయాత్రలో కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులుగౌడ్, రాజిరెడ్డి, సుహాసినిరెడ్డి తదితరులు

డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్ రూరల్: మండలంలోని తుజాల్‌పూర్‌లో సోమవారం డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. దానిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి పౌరుడిపై ఉందని గుర్తుచేశారు. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్త, బ్లాక్ కాంగ్రెస్ రిజ్వాన్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేష్, నాయకులు సుధీర్‌గౌడ్, మోహన్‌దాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మేఘమాల, కిషన్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయిలో స్థిరపడాలి

డీబీసీడబ్ల్యూఓ జగదీష్



సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్

కౌడిపల్లి(నర్సాపూర్): హాస్టల్ విద్యార్థులు శ్రద్ధగా చదివి జీవితంలో ఉన్నతస్థాయిలో స్థిరపడాలని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి జగదీష్ అన్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో వసతిగృహ సంక్షేమాధికారి ప్రణయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హాస్టల్‌లో అన్నిరకాల సదుపాయాలు కల్పిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్‌తో పాటు పైచదువులు బాగా చదివి తల్లిదండ్రులు, హాస్టల్‌కు మంచిపేరు తేవాలన్నారు. అనంతరం టీఎస్‌జీఓ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్టల్‌లో మెరుగైన సదుపాయలు ఉన్నాయన్నారు. కార్పొరేట్ స్థాయిలో వార్షికోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓల సంఘం జిల్లా అధ్యక్షుడు శేషాచారి, ఎస్టీ ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ జయరాజ్, జిల్లాలోని వివిధ హాస్టల్‌ల హెచ్‌డబ్ల్యూఓలు శేఖర్, మహేందర్, నవీన్, స్వామి, ఉన్నత పాఠశాల ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ జగన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న అన్నపూర్ణ

కొమురవెల్లి నూతన ఈఓగా అన్నపూర్ణ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ఈఓగా అన్నపూర్ణ బాధ్యతలు స్వీకరించారు. అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న రామాంజనేయులును దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో నగరంలోని చిక్కడపల్లి వేంకటేశ్వర స్వామి దేవాస్థానం అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణకు మల్లన్న ఆలయ ఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు అన్నపూర్ణ సోమవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్ రెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు

వైభవంగా పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

రామాయంపేట(మెదక్): పాండచెరువు కట్టపై కొలువైన కల్యాణ రామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఈసందర్భంగా దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగించారు. అంతకుముందు భక్తులు ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో ఘటాభిషేకం, చక్రస్నానం కార్యక్రమాలు చేపట్టారు.



నూతన పాలకమండలి సభ్యులతో ఎంపీ సురేష్ షెట్కార్, తదితరులు

కేతకీ ఆలయాభివృద్ధికి కృషి

- ఎంపీ సురేశ్ షెట్కార్
- నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం

ఝురాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని జహీరాబాద్ ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్ హామీనిచ్చారు. నూతనంగా ఏర్పాటైన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఆలయంలో నిర్వహించారు. ముందుగా ఆలయానికి వచ్చిన ఆయన గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ...ఆలయానికి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి అభివృద్ధికి పాటుపడతానన్నారు. అభివృద్ధి జరిగితేనే మరింతగా భక్తులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీమంత్రి చంద్రశేఖర్, సునీతా పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం ఏదీ?

- తొమ్మిదేళ్ల క్రితం ప్రతిపాదనలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు




అల్లాదుర్గం మండలంలో గంజాయి మొక్కలను ధ్వంసం చేసిన అధికారులు (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): 2016 పునర్విభజనలో భాగంగా అల్లాదుర్గంలో ఎక్సైజ్ కార్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. తొమ్మిదేళ్లు గడిపోయినా ఇప్పటికీ మంజూరు కాలేదు. ఎక్సైజ్ అధికారులు ఇక్కడి రావాలంటే 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో కల్తీ కల్లు, గంజాయి విక్రయంపై నిఘా కొరవడిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పునర్విభజనలో భాగంగా ప్రభుత్వం అల్లాదుర్గంలో సబ్ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేసింది. అల్లాదుర్గం సర్కిల్ కేంద్రంగా టేక్మాల్, రేగోడ్, పెద్దశంకరంపేట మండలాలను కలుపుతూ పోలీస్ సర్కిల్ కార్యాలయం, పంచాయతీరాజ్, ఇరిగేషన్ సబ్ డివిజన్, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాలతో పాటు, జూనియర్ సివిల్ ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పునర్విభజనకు ముందు ఈ మండలాలు జోగిపేట సర్కిల్ పరిధిలో ఉండేవి. కాగా అల్లాదుర్గంలో పోలీస్ సర్కిల్ కార్యాలయం 2016లోనే ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపారు. అయితే అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అది కలగానే మిగిలింది. అయితే అల్లాదుర్గంలో కార్యాలయం ఏర్పాటు చేయడానికి పాత పోలీస్‌స్టేషన్ భవనం వాడుకోవచ్చని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ భవనం వృథాగా ఉందన్నారు. ఇదే విషయమై జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా.. అల్లాదుర్గంలో ఎక్సైజ్ కార్యాలయం మంజూరుకు గతంలో ప్రతిపాదనలు పంపిన విషయం వాస్తవమేనని అన్నారు. అయితే ఇటీవల ప్రభుత్వం కొన్నిస్టేషన్లను మంజూరు చేసిందని.. జిల్లాకు మాత్రం మంజూరు కాలేదన్నారు. జిల్లాలో గంజాయి సాగు చేయకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కల్తీ కల్లు విక్రయాలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. రహదారుల పక్కన కల్లు విక్రయించకూడదని అన్నారు.

క్లుప్తంగా

శివలింగం వద్ద నాగుపాము



ఆలయంలో నాగుపాము

శివ్వంపేట(నర్సాపూర్‌): శివలింగం వద్ద నాగుపాము గంటపాటు పడగ విప్పి ఉండటంతో గ్రామస్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధి బిజ్లిపూర్‌లోని హనుమాన్‌ ఆలయంలోకి ఆదివారం అర్ధరాత్రి ప్రాంతములో నాగుపాము ప్రవేశించింది. పడగ విప్పి గంటపాటు అక్కడే ఉంది. అదే సమయంలో అటుగా వెళ్లిన గ్రామ యువకులు నవీన్‌, నర్సింలు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. సాక్షాత్తు పరమశివుడే దర్శనమిచ్చాడని సోమవారం ఉదయం గ్రామస్తులు శివలింగంకు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

ముంపు గ్రామాల కార్మికులకు వేతనాలు చెల్లించండి



గరీమా అగర్వాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్‌: మల్లన్నసాగర్‌ ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన ముంపు గ్రామాల పంచాయతీ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్‌ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ గరీమా అగర్వాల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎల్లయ్య మాట్లాడుతూ.. ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలో ఉంటున్న ముంపు గ్రామాల పంచాయతీ కార్మికుల ఖాతాలను మూసివేయడంతో నాలుగు నెలలుగా వారికి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. దీంతో అప్పులు చేస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల ఖాతాలను తిరిగి పునరుద్ధరించి బకాయి వేతనాలు చెల్లించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు స్వామి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం



పటాన్‌చెరు టౌన్‌: గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైన ఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని సుల్తాన్‌పూర్‌ శివారులోని మెడికల్‌ డివైస్‌ పార్క్‌లోని క్వారీ గుంతలో సోమవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 22 నుంచి 27 వరకు ఉంటుందని తెలిపారు. ఛాతిపై యాదమ్మ అని పచ్చబొట్టు ఉండటాన్ని గుర్తించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించామని, మృతుడి బంధువులు ఉంటే అమీన్‌పూర్‌ పోలీసులను సంప్రదించాలన్నారు.

అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

దుబ్బాకరూరల్‌: బాలలపై జరుగుతున్న అఘాయిత్యాలపై మండలంలోని రాజక్కపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మహిళా శిశుసంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్‌ హెల్ప్‌ లైన్‌ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బాలికలు చిన్న వయస్సులో వివాహం చేసుకుంటే కలిగే నష్టాలపై వివరించారు. గుర్తు తెలియని వ్యక్తులు, సోషల్‌ మీడియాలో చాట్‌ చేయడం వంటిది మంచిది కాదన్నారు. బాలలపై ఎలాంటి అఘాయిత్యాలు జరిగిన 1098కు కాల్‌ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ కౌన్సిలర్‌ నర్సింలు, లక్ష్మణ్‌, పాఠశాల హెచ్‌ఎం అంజిరెడ్డి, శ్రీనివాస్‌, యాదగిరి పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

కొండపాక(గజ్వేల్‌): కుకునూరుపల్లిలోని సీతారామచంద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అత్యంత వైభవంగా సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. జై శ్రీరామ్‌ జైజై శ్రీరామ్‌ అంటూ 125 మంది మహిళలు కుంకుమార్చన చేశారు. రాత్రి పూట సీతారామ చంద్ర స్వాముల ఉత్సవ విగ్రహాలను భక్తుల దర్శనార్థం హంస వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. మంగళహారలతో ఉత్సవ విగ్రహాలకు ఘన స్వాగతం పలికారు.

గండిపల్లి ప్రాజెక్టు కలేనా?

18 ఏళ్లుగా రైతుల ఎదురుచూపు

- పూర్తయితే 14 వేల ఎకరాలకు సాగునీరు
- హాథ్‌ సే హాథ్‌ జోడో యాత్ర సందర్భంగా ప్రాజెక్టును సందర్శించిన రేవంత్‌రెడ్డి
- మళ్లీ ప్రారంభానికి నోచుకోని పనులు
- పట్టించుకోని ప్రభుత్వాలు

అక్కన్నపేట మండలం గౌరవెల్లి రిజర్వాయర్‌కు అనుబంధంగా నిర్మిస్తున్న గండిపల్లి ప్రాజెక్ట్‌ పూర్తి కలగానే మిగిలిపోయింది. ఇది పూర్తయితే తమ పంటలకు సాగు నీరు అందుతుందని ఆశపడ్డ రైతులకు నిరాశే ఎదురవుతుంది. 18 ఏళ్ల కిందట ప్రారంభమైన పనులు 45 పూర్తయ్యాయి. పలు కారణాలతో ప్రభుత్వాలు అటువైపు చూడకపోవడంతో ప్రాజెక్ట్‌ నిర్మాణం అటకెక్కింది.

– అక్కన్నపేట(హుస్నాబాద్‌)



నీళ్లు లేక వెలవెలబోతున్న గండిపల్లి ప్రాజెక్టు

గౌరవెల్లి రిజర్వాయర్‌కు అనుబంధంగా గండిపల్లి ప్రాజెక్ట్‌ నిర్మించాలని 2007లో అప్పటి సీఎం వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి 0.156 టీఎంసీల సామర్థ్యంతో 14 వేల ఆయకట్టు లక్ష్యంగా పాత చెరువుపై శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. సుమారుగా 45 శాతం పనులు పూర్తయిన తర్వాత ప్రాజెక్ట్‌ పనులు నిలిచిపోయాయి. 2014లో టీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గౌరవెల్లి ప్రాజెక్టును 8.26 టీఎంసీ, గండిపల్లి ప్రాజెక్టును 1.4 టీఎంసీలకు పెంచి 40 వేల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలని నిర్ణయించారు. కానీ ఆ దశగా ఎలాంటి పనులు జరగలేదు.

సీఎం రేవంత్‌రెడ్డి సందర్శించినా..

హాథ్‌ సే హాథ్‌ జోడో యాత్రలో భాగంగా 2023లో గండిపల్లి ప్రాజెక్టును ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి, హుస్నాబాద్‌ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌ సందర్శించారు. ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యం జరిగిందని, రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ప్రాజెక్టు నిర్మాణానికి పునాది వేసి దాదాపు 18 ఏళ్లు గడిచింది. ఇప్పుడు కాంగ్రెస్‌ అధికారంలో వచ్చి సుమారు 15 నెలలు అవుతుంది. అయినా గండిపల్లి ప్రాజెక్టు నిర్మాణపై ఊసే ఎత్తకపోవడంతో మెట్ట ప్రాంత రైతన్నలు, గ్రామస్తులు భగ్గుమంటున్నారు.



దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు

మెట్ట ప్రాంత రైతుల 18 ఏళ్ల గండిపల్లి ప్రాజెక్టు నిర్మాణ కల నెరవేరేనా అనే ప్రశ్నలు రైతుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. ఇటీవల రాష్ట్ర బడ్జెట్‌లో గండిపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి ఎలాంటి నిధులు కేటాయింపు విషయం ప్రస్తావనకు రాలేదు. ప్రాజెక్ట్‌ పనులు పూర్తిగా నిలిచిపోవడంతో కట్టపై దట్టంగా ముళ్ల చెట్లు పెరిగాయి. ఇకనైనా త్వరగా మంత్రి ప్రొన్నం ప్రభాకర్‌ ప్రత్యేక దృష్టి సారించి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

ప్రాజెక్టును పూర్తి చేయాలి



గండిపల్లి ప్రాజెక్టు అనేది ఈ ప్రాంత రైతన్నల ఏళ్లనాటి కల నెరవేరాలని కోరుతున్నా. పలుమార్లు మంత్రి పొన్నం ప్రభాకర్‌ దృష్టికి తీసుకెళ్లాం. 2026 సంవత్సరం చివరి కల్లా పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని అంటున్నారు. ప్రస్తుతం సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి.

– వెంకటేశ్‌ నాయక్‌, శ్రీరాంతండా

15 నెలలు గడిచాయి



గండిపల్లి ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందించాలని పదే పదే మంత్రికి విన్నవించుకుంటున్నాం. కాంగ్రెస్‌ అధికారంలో వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రాజెక్టు పూర్తయితే పంచరాయితండా, అంబనాయక్‌తండా, ఏన్యతండాలకు గండిపల్లి నుంచి రాకపోకలు దూరమవుతాయి. ఈ తండాల్లో దాదాపు 100కు పైగా ఇళ్లు ఉంటాయి. వీరందరికీ పరిహారం చెల్లిస్తే తామంతా మరో చోట ఇళ్లను నిర్మించుకుంటాం.

– భూక్య భిక్షపతి, పంచరాయితండా

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

చిన్నశంకరంపేట(మెదక్‌): రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కామారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. కామారెడ్డి రైల్వే పోలీస్‌ల కథనం మేరకు.. చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లి–వడియారం రైల్వేస్టేషన్‌ల మధ్యలో కామారం తండా 226 రైల్వే గేట్‌ సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు చూసి రైల్వే పోలీస్‌లకు సమాచారం అందించారు. కామారెడ్డి రైల్వే పోలీస్‌ ఎస్‌హెచ్‌ఓ హనుమండ్లు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిస్తే కామారెడ్డి రైల్వే పోలీస్‌లను సంప్రదించాలని కోరారు.

మూర్ఛవ్యాధితో యువకుడు..



అనిల్‌ (ఫైల్‌)

నర్సాపూర్‌ రూరల్‌: మూర్ఛ వ్యాధితో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని రుస్తుంపేటలో సోమవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ లింగం కథనం మేరకు.. గ్రామానికి చెందిన కర్రె అనిల్‌ (26) 5న ఇంటి నుంచి కూలీ పనుల కోసం వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. 6న పంట పొలాల వైపు వెళ్లిన గ్రామస్తులకు బురుదలో పడి అనిల్‌ మృతి చెంది కనిపించాడు. మూర్ఛ వ్యాధితో తన కుమారుడు చనిపోయాడని తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో ఉరేసుకొని ఆత్మహత్య

నర్సాపూర్‌ రూరల్‌: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నర్సాపూర్‌ పట్టణంలోని చైతన్యపురి కాలనీలో సోమవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. నర్సాపూర్‌ ఎస్సై లింగం కథనం మేరకు.. నర్సాపూర్‌ పట్టణంలోని చైతన్య పూరి కాలనీకి చెందిన మల్లెపూల వెంకటేశ్‌ మద్యానికి బానిసై తరచూ భార్య సంతోష, ఇతర కుటుంబ సభ్యులతో గొడవపడుతున్నాడు. ఆదివారం రాత్రి అతిగా మద్యం సేవించి మళ్లీ కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. సోమవారం తెల్లవారు జామున ఇంట్లోని ఓ గదిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో మహిళ



మౌనిక (ఫైల్‌)

చిన్నశంకరంపేట(మెదక్‌): కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నార్సింగి మండలం వల్లూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అహ్మద్‌ మోహినోద్దీన్‌ కథనం మేరకు.. వల్లూర్‌కు చెందిన డోడ్లె సురేశ్‌కు వెల్దుర్తి మండలం బండపోసాన్‌పల్లి గ్రామానికి మౌనిక(30)తో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మౌనిక స్థానికంగా ఉన్న పరిశ్రమలో పనికి వెళ్తుండగా సురేశ్‌ వ్యవసాయం, ఉపాధి కూలీ పనులు చేస్తుంటాడు. కొద్ది రోజులు గా పరిశ్రమలో పనికి వెళ్లొద్దని దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం ఉదయం పరిశ్రమలో పనికి వెళ్లొద్దని సురేశ్‌ భార్యకు చెప్పి ఉపాధి పనికి వెళ్లాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పనులు ముగించుకొని ఇంటికొచ్చిన భర్త చూసి పోలీస్‌లకు సమాచారం ఇచ్చాడు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మౌనిక మృతిపై తల్లి శేఖమ్మ అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల వేతనాలు విడుదల చేయాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతి



కలెక్టరేట్‌ ఏఓకు వినతిపత్రాన్ని అందిస్తున్న సీఐటీయూ నాయకులు

సిద్దిపేటరూరల్‌: పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ఏఓకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య మాట్లాడుతూ.. సీఎం ప్రకటించిన విధంగా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రూ.18 వేలకు పెంచి, జీఓ నంబర్‌ 51ను సవరించాలన్నారు. అదే విధంగా మల్టీపర్పస్‌ వర్కర్‌ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం బకాయి వేతనాలకు నిధులు కుడి చేతితో ఇచ్చి ఎడమ చేతితో నోటికాడి ముద్దను లాక్కున్నట్లుగా ట్రెజరీలో వేసిన చెక్కులకు ఆర్థిక శాఖ డబ్బును కేటాయించకుండా నిలిపివేయడంతో తొమ్మిది నెలలుగా వేతనాలు రావడం లేదన్నారు. కుటుంబాల పోషణ భారమై కార్మికులు అప్పుల పాలవుతున్నారన్నారు. వెంటనే వేతనాలు విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. 19 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు వెళ్తామని సమ్మె నోటీస్‌ను అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్‌, యూనియన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేశ్‌, జిల్లా నాయకులు బాకీ యాదగిరి, రాజమౌళి, కనకయ్య, బాల నర్సవ్వ, అండాలు వివిధ గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఇద్దరు అదృశ్యం

భార్యతో గొడవపడి యువకుడు

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): యువకుడు అదృశ్యమైన ఘటన చిలప్‌చెడ్‌ మండలం సామ్లా తండా పంచాయతీ పరిధిలోని బట్టు తండాలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్‌ఐ నర్సింహులు కథనం మేరకు.. బట్టు తండాకు చెందిన కేతావత్‌ సంతోష్‌ కుమార్‌ ఆదివారం భార్య వసంతతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి పోయాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో సోమవారం భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఇంటి నుంచి వెళ్లే సమయంలో సంతోష్‌ కుమార్‌ బ్లూ కలర్‌ ప్యాంట్‌, లైట్‌ బ్లూ కలర్‌ షర్ట్‌ వేసుకున్నాడని, 30 ఏళ్ల వయస్సు ఉంటుందని పేర్కొన్నారు.

ఇంటి నుంచి వెళ్లి వివాహిత

గజ్వేల్‌రూరల్‌: వివాహిత అదృశ్యమైన ఘటన గజ్వేల్‌ పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని పటేల్‌ బజార్‌కు చెందిన కుడుముల నర్సింలు– భాగ్యలక్ష్మీ దంపతులకు కుమారుడు పవన్‌, కూతురు ఉన్నారు. నర్సింలు ఆదివారం స్వగ్రామమైన తూప్రాన్‌ మండలం వెంకటరత్నాపూర్‌కు వెళ్లాడు. పవన్‌ చెప్పిన మాట వినడం లేదంటూ భాగ్యలక్ష్మీ తన ఫోన్‌, ఆధార్‌కార్డును వెంట బెట్టుకొని బయటకు వెళ్తుండగా.. కూతురు, అల్లుడు వద్దని వారించినప్పటికీ వినకుండా వెళ్లిపోయింది. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. సోమవారం బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నిందితులను చూపుతున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్‌

గంజాయి విక్రేతల అరెస్ట్‌

- ములుగులో ఐదుగురు, మునిపల్లిలో ఇద్దరు
- 1,040 గ్రాముల గంజాయి స్వాధీనం

ములుగు(గజ్వేల్‌): గంజాయి విక్రయిస్తూ, సేవిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి సోమవారం గజ్వేల్‌ కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ములుగు మండలం కొట్యాల గ్రామ శివారులో కొందరు గంజాయి తాగుతూ విక్రయిస్తున్నారని విశ్వసనీయమైన సమాచారం అందింది. సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నాం. సిద్దిపేట జిల్లా మర్కూక్‌ మండలం కర్కపట్ల గ్రామానికి చెందిన సారా నవీన్‌(21), సారా అశోక్‌(20), సారా సుధాకర్‌(23), యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం సోమాజిపల్లి తాండాకు చెందిన కేతావత్‌ సంజయ్‌కుమార్‌(20), మేడ్చెల్‌–మల్కాజిగిరి జిల్లా అహ్మద్‌గూడ గ్రామానికి చెందిన కార్తీక్‌(20) గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డారు. వెంటనే వారిని అరెస్టు చేసి 920 గ్రాముల గంజాయి, రూ.33 వేల నగదు, 2 బైక్‌లు, 4 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని గజ్వేల్‌ కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

120 గ్రాముల గంజాయి స్వాధీనం



ఎండు గంజాయి

మునిపల్లి(అందోల్‌): వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో ఇద్దరి నుంచి ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు బుదేరా ఎస్‌ఐ రాజేశ్‌ నాయక్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కంకోల్‌ శివారు 65వ నంబర్‌ జాతీయ రహదారి టోల్‌ ప్లాజా సమీపంలో సోమవారం వాహనాల తనిఖీ చేస్తున్నాం. స్కూటీపై జహీరాబాద్‌ నుంచి హైదరాబాద్‌ వెళ్తున్న మహమ్మద్‌ అయూబ్‌ అలీ, షేక్‌ సమీర్‌ 120 గ్రాముల గంజాయి తరలిస్తుండగా పట్టుకొని అరెస్ట్‌ చేశాం. బీదర్‌లోని ఇరానీ గల్లీలో ఇర్ఫాన్‌ అనే వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు నిందితులు తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్‌ఐ రాజేశ్‌ నాయక్‌, పోలీస్‌ సిబ్బంది ఎండీ. అనీఫ్‌, పాండు, తుకారాం, దత్తు, సునీల్‌ను కొండాపూర్‌ సీఐ వెంకటేశం అభినందించారు.

జాతీయ స్థాయి శిక్షణకు ముగ్గురు విద్యార్థులు

ఇస్రో ఆధ్వర్యంలో యువికా–2025 శిక్షణ



హర్షవర్ధన్‌



కౌశిక్‌



సుశాంత్‌

దుబ్బాక: ఇస్రో ప్రతిష్టాత్మకంగా జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న యువికా–2025 శిక్షణకు దుబ్బాక మున్సిపల్‌లోని లచ్చపేట మోడల్‌ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇస్రో ఈ శిక్షణకు జనవరి నెలలో దేశ వ్యాప్తంగా 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. వివిధ రాష్ట్రాలకు చెందిన మొత్తం 350 మంది విద్యార్థులు ఎంపిక కాగా తెలంగాణ నుంచి 12 మంది ఎంపికయ్యారు. ఇందులో లచ్చపేట మోడల్‌ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు విద్యార్థులు హర్షవర్ధన్‌, కౌశిక్‌, సుశాంత్‌ ఎంపిక కావడం విశేషం. మే నెలలో 15 రోజులపాటు ఇస్రో పరిశోధన కేంద్రంలో నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఇస్రో జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికైన లచ్చపేట మోడల్‌ స్కూల్‌ విద్యార్థులను, గైడ్‌ టీచర్‌ జ్యోతిని సోమవారం ఎంఈఓ ప్రభుదాసు, ప్రిన్సిపాల్‌ సామలేటి బుచ్చిబాబు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

ఆరోగ్యమే మహాభాగ్యం..



మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతిరెడ్డి

న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి స్వాతిరెడ్డి

సిద్దిపేటకమాన్‌: ఆరోగ్యమే మహాభాగ్యమని.. ఆరోగ్యానికి మించిన సంపద ఏదీ లేదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి స్వాతిరెడ్డి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి ఆదేశాల మేరకు సిద్దిపేట కోర్టులో సోమవారం నిర్వహించిన మెడికల్‌ హెల్త్‌ క్యాంపును న్యాయమూర్తి స్వాతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే అన్ని పనులు చేయగలుగుతారని సూచించారు. ఆహార నియమాలు పాటిస్తూ వాకింగ్‌, యోగా, వ్యాయామం చేయాలన్నారు. తీసుకునే ఆహారంపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. హెల్త్‌ క్యాంపులో న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి, కక్షిదారులకు బీపీ, షుగర్‌, గుండె, గ్యాస్ట్రాలజీ సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మిలింద్‌ కాంబ్లీ, చందన, తరణి, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు జనార్దన్‌ రెడ్డి, కార్యదర్శి తాటికొండ రమేశ్‌, డాక్టర్‌ శ్రీకాంత్‌, న్యాయవాదులు పత్రి ప్రకాశ్‌, లక్ష్మీనారాయణ, రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల దాహార్తి తీరేలా..

- అటవీ ప్రాంతంలో నీటి తొట్లు ఏర్పాటు
- 15 రోజులకు ఒకసారి నీటిని నింపుతున్న అధికారులు
- సీసీ కెమెరాలతో జంతువుల కదలికలు నమోదు
- దుబ్బాక రేంజ్‌ పరిధిలో 16,326 ఎకరాల అడవి విస్తీర్ణం



సాసర్‌ పిట్లలో నీళ్లు తాగుతున్న నక్కలు

దుబ్బాకటౌన్‌: మండుతున్న ఎండలతో అడవుల్లో నీటి జాడ లేక వన్య ప్రాణులు అలమటిస్తున్నాయి. తాగు నీటి కోసం వన్యప్రాణులు మైదాన ప్రాంతాలకు వస్తున్న నేపథ్యంలో వాటి రక్షణకు దుబ్బాక అటవీ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆరు నెలలుగా వర్షాలు లేక అటవీ ప్రాంతంలోని నీటి జాలు గుంతలన్నీ వట్టి పోయాయి. దీంతో అడవి జంతువులకు తాగునీరు దొరకడం కష్టంగా మారింది. వాటి దాహాన్ని తీర్చేందుకు అటవీ ప్రాంతంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన నీటి తొట్లలో అటవీ శాఖ అధికారులు నీటిని నింపుతున్నారు. దుబ్బాక రేంజ్‌లోని ఫారెస్టులో 28 నీటి తొట్లు ఏర్పాటు చేశారు. 15 రోజులకు ఒక్కసారి ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. ఆ నీటితోనే జంతువులు, పక్షులు దాహార్తిని తీర్చుకుంటున్నాయి.

16,326 ఎకరాల అడవి

దుబ్బాక రేంజ్‌ పరిధిలో దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట భూంపల్లి, తొగుట, దౌల్తాబాద్‌, రాయపోల్‌, సిద్దిపేట రూరల్‌ పరిధితో కలుపుకొని 16,326 ఎకరాల అడవి విస్తీర్ణం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అడవిలో దుప్పిలు, చిరుత పులులు, ఎలుగుబంట్లు, జింకలు, నెమళ్లు, అడవి పందులు, నక్కలు, అడవి గొర్రెలు, కుందేళ్లు ఇలా పలు రకాల జంతువులు సంచరిస్తున్నాయి.

కెమెరాలకు చిక్కిన జంతువుల ఫొటోలు

నీటి తొట్ల పరిసర ప్రాంతాల్లో అధికారులు సీసీ కెమెరాలను సైతం అమర్చారు. నీరు తాగేందుకు వచ్చే పక్షులు, జంతువులు చిత్రాలు కెమెరాల్లో నమోదవుతున్నాయి. కెమెరాల నుంచి ఫొటోలను డంప్‌ చేసుకొని వాటి బాగోగులను, ఆరోగ్య పరిస్థితులను అంచనా వేస్తున్నారు.

జీవాల రక్షణకు చర్యలు



వేసవిలో అడవి జంతువుల దాహార్తిని తీర్చేందుకు సాసర్‌ పిట్లలో నీటిని నింపుతున్నాం. దుబ్బాక రేంజ్‌ పరిధిలో వేసవిలో అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

–సందీప్‌ కుమార్‌, ఫారెస్ట్‌ రేంజ్‌ ఆఫీసర్‌, దుబ్బాక